క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న సీపీ త్రివిక్రమవర్మ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సీపీ త్రివిక్రమవర్మ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ఆనందగజపతిరాజుకు నివాళి



ఆనంద గజపతిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం దివంగత అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనందగజపతిరాజు జయంతిని సోమవారం సింహాచలం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆనందగజపతిరాజు చిత్రపటానికి దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటిండెంట్ సునీల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాడచీపురుపల్లిలో 'సురక్ష'

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి గ్రామ సచివాలయం-2లో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలోఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో వివిధ ధ్రువ పత్రాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోన కోరారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

పరవాడ: గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘాలకు ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో 45 గ్రామ సంఘా ల సభ్యులకు 10 రకాలకు చెందిన వివిధ పండ్ల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, చుక్క రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



రాజేశ్వరి

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు.. విరాట్ నగర్‌లో జిన్నింగ్ ప్రాంతానికి చెందిన జీలకర్ర రాజేశ్వర్రి ఈనెల 15వ తేదీ సాయంత్రం నుంచి కనిపించడం లేదని భర్త జీలకర్ర నాగ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. రాజేశ్వరి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

సింహాచలం: పెందుర్తిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అనిడ్స్ డెంటల్ ఆస్పత్రి యాజమాన్యం సంయుక్తంగా సోమవారం స్థానిక బాలాజీ స్కూల్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ మధుపాడ నాగమణి ప్రారంభించారు. వైద్యురాలు డాక్టర్ లిఖిత ఆధ్వర్యంలో 200 విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. స్కూల్ అధినేత నాగేశ్వరరావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- నారపాడు, బాటజంగాలపాలెంలో గ్రామసభలు



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పించిన మరో అవకాశమే జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని నారపాడు,బాటజంగాలపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజా శ్రేయస్సు,సంక్షేమం కోసం పనిచేసే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. వివక్షలేని పాలన అందిస్తూ మంచి జరిగితేనే తమకు మద్దతుగా నిలిచి ఓట్లు వేయాలని సీఎ జగన్ ధైర్యంగా అడుగుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పెందుర్తి సభలో వలంటీర్లను గజదొంగలుగా విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నారపాడు వచ్చినప్పుడు తాగునీటి సమస్య ఉందని చెప్పారన్నారు. రూ.50 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రైన్ల ఏర్పాటుకు రూ.6 లక్షలు కేటాయించామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామం నుంచి బంజీరి,అనకాపల్లి వెళ్లే రోడ్డు సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆయన సొంత నిధులతో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. పలువురి లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,సర్పంచ్ మామిడి శంకరరావు, ఎంపీటీసీ మామిడి లక్ష్మి, జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీడీవో రమేష్ నాయుడు, సీఐ రంగనాథం, పార్టీ సీనియర్ నాయకులు వనం అచ్చెంనాయుడు,సర్పంచ్ పడాల వెంకట రమణ,మామిడి కొండాజీ,రాపేటి రాము,కాపుశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష... జగనన్న సురక్ష

95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు

సింహాచలం: ఉచితంగా 11 రకాల ధ్రువ పత్రాలు అందించడంతో పాటు వివిధ పథకాలకు అర్హులను గుర్తించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డులోని 484 సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న సర్కక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మన దేముడు మాట్లాడుతూ ప్రజలకు రక్షగా జగనన్న సురక్ష నిలుస్తుందన్నారు. ఏఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభు త్వం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు వర్గాలు, కులాలు, పార్టీలు, మతాలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మనలత జోబ్‌దాస్, కె.సంతోష్, పార్టీ నాయకులు సీహెచ్. జల్లుబాబు, బొడ్డు దేముడుబాబు, గోపాల్, సచివాలయం సిబ్బంది, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, రజక కాలనీకి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఉచితంగా ధ్రువపత్రాలు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని 79 వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు పిలుపునిచ్చారు. దేశపాత్రునిపాలెం గ్రామ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన 11 ధ్రువపత్రాలు ఉచితంగా అందించాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో పలువురి లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల ఉధృతికి చెక్



బోదువలసలో బీజామృతం తయారు చేస్తున్న రైతులు

సబ్బవరం: విత్తన శుద్ధి ద్వారా ప్రకృతి వ్యవసాయంలో తెలుగుళ్ల ఉధృతిని నియంత్రించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి జి. సోమలత తెలిపారు. మండలంలోని బోదువలసలో బీజామృతం తయారు చేసే విధానాలపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. 20 మంది రైతులతో కలిసి బీజామృతం తయారు చేశారు. ఎకరా ప్రకృతి వ్యవసాయం సాగుకు 20 లీటర్ల నీరు, 5 కిలోల దేశీయ ఆవు పేడ, 5 లీటర్ల దేశీయ ఆవు మూత్రం, 50 గ్రాముల సున్నం అవసరమన్నారు. 5 కిలోల పేడను 20 లీటర్ల నీటిలో మూట కట్టి దించాలని, ఆ నీటిలో 5 లీటర్ల దేశీయ ఆవు మూత్రాన్ని వేసి ఉంచితే 12 గంటల తర్వాత బీజామృతం తయారవుతుందని వివరించారు. ఇలా తయారైన బీజామృతంతో వరి విత్తనాలతో పాటు పలు రకాల విత్తనాలను శుద్ధి చేసుకోవడం వల్ల భూమి నుంచి సంక్రమించే వ్యాధులు, తెగుళ్లు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. మొలకల శాతం బాగా వస్తుందని వివరించారు. కార్యక్రమంలో బోదువలస మాజీ సర్పంచ్ కోన సంజీవరావు, రైతులు కోన అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు బోకం గౌరీ,ద్వారపురెడ్డి రమణి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అక్కిరెడ్డిపాలెంలో ఉత్సాహంగా గడప గడపకు..



అక్కిరెడ్డిపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ధ్యేయంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరగుతోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయన్ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అప్పుడు పూర్తి స్థాయిలో పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రతి పక్షాల మాటలు వినకుండా గత పాలనకు ప్రస్తుత పాలనకు తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, జేసీఎ కన్వీనర్ నక్క కనకరాజు, సర్పంచ్ ఉగ్గిన గోవింద్, పార్టీ నాయకులు అక్కిరెడ్డి వెంకటరమణ, సుకవాసి సతీష్, అప్పారావు, అక్కిరెడ్డి విజయ్, జంగాలపాలెం సర్పంచ్ గొరపల్లి సాంబ, ఎంపీడీవో వసంత, ఈవోఆర్‌డీ అప్పారావు, వెలుగు ఏపీఎం రమణ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో గోవింద్, వాటర్ సప్లై ఏఈ సుమలత, పంచాయతీ రాజ్ వర్క్స్ ఏఈ స్వాతి, అగ్రికల్చరల్ ఆఫీసర్ దుర్గ ప్రసాద్, హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణపై దృష్టి



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు వెటర్నరీ విభాగపు అధికారి డాక్టర్ కిషోర్ నేతృత్వంలో సిబ్బంది రంగంలోకి దిగారు. 95వ వార్డు పోర్లుపాలెంలో కుక్క దాడిలో గాయపడిన చీపురుపల్లి రుత్విక్ అనే బాలుడిని పరామర్శించారు. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆ వార్డులో సుమారు 25 వీధి కుక్కలను పట్టుకొని ఆపరేషన్ కోసం పంపించినట్టు వెటర్నరీ డాక్టర్ కిషోర్ తెలిపారు. మేయర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సుమారు 100 వీధి కుక్కలకు ఇసుకతోట, గోపాలపట్నం, గాంధీగ్రామం, నరవ, చినగదిలి, జడ్జికోర్టు సమీపాన గల వెటర్నరీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అర్చకులు పవన్ తదితరులు ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా



దేశపాత్రునిపాలెంలో ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

పరవాడ: మణిపూర్ మారణకాండకు ముగింపు పలకాలని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశపాత్రునిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం మహిళా సమాఖ్య సభ్యులు నిరసన తెలిపారు. పరమేశ్వరి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి పర్యటనకు వెళ్లిన అనీరాజా బృందంపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో అధికారంలో ఉన్న బీజేపీ వెనుకబడిన జాతుల మధ్య చిచ్చు రగిల్చి మారణహోమానికి తావిచ్చిందని ఆరోపించారు. సత్వరమే జాతీయ స్థాయిలో అఖిల పక్షం ఏర్పాటు చేసి ప్రధాని నేతృత్వంలో మణిపూర్‌లో పర్యటించాలని కోరారు. శాంతి నెలకొల్పడానికి వెళ్లిన అనీరాజా బృందంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఇది ప్రభుత్వ నీతిమాలిన చర్య అని ఆమె విమర్శించారు. నిరసన కార్యక్రమంలో కె.లక్ష్మి, నారాయణమ్మ, రమణమ్మ, లక్ష్మి, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతకాపల్లిలో 'సురక్ష' సర్వే

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాతకంగా చేపట్టి జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సభ మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఈ నెల 24న నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో సురక్ష సర్వేను సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవల వివరాలు సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు,వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డు మెంబర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



విశేష అలంకరణలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమ వారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

షట్టర్లు విరగ్గొట్టి నాలుగు షాపుల్లో చోరీ



బేకరీలో విరగ్గొట్టిన షట్టర్‌ను చూపుతున్న యజమాని

అక్కిరెడ్డిపాలెం: దుండగులు నాలుగు షాపుల్లో షట్టర్లు విరగ్గొట్టి, నగదు అపహరించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై గాజువాక క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరీ, ఒక అక్వేరియమ్‌లో అర్ధరాత్రి దొంగలు షాపుల షట్టర్లు విరగ్గొట్టారు. సోమవారం ఉదయం వచ్చి చూసుకున్న ఆయా షాపుల యజమానులు వెంటనే గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. నాలుగు షాపుల్లో కలిసి సుమారు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నగదును అపహరించారని తెలిపారు. గాజువాక క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్లాంట్ పరిరక్షణకు సుదీర్ఘ పోరాటం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, ప్లాంట్ ఉద్యోగులు

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ఏ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉక్కు దీక్షకే ఈ ఘనత దక్కుతుందని కొనియాడారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 886వ రోజు సోమవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఆ కుట్రలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, అనకాపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరవాడ మండలం వెన్నెలపాలెం కల్యాణమండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బాలబాలికలకు సబ్ జూనియర్ (9 నుంచి 14 సంవత్సరాలు), జూనియర్ (15 నుంచి 18), సీనియర్ (19 నుంచి 28) విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు వచ్చేనెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. వివరాలకు 97016 58665, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వి.నాగేశ్వరరావు, పిల్లా రవిశంకర్, లోవరాజు, అన్నాజీరావు, శ్రీదేవి, రౌతు దేవి తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



శిబిరం వద్ద మాట్లాడుతున్న కొవిరి అప్పలరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించిన నాయకులు, కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులకు బేసిక్ రూ.3,700 ఇవ్వడం అన్యాయమన్నారు. డీఏను బేసిక్‌లో కలిపి, రూ.22వేలు బేసిక్ ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకీలో అధిష్టంపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రావణ్‌కుమార్, పారాయణదాలు, పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

30న సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు

మద్దిలపాలెం: విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘం కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నామన్నారు. ఎన్నికల్లో అన్ని అంశాలలో సేవలందిస్తున్న కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81796 05267 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీసులు

కూర్మన్నపాలెం: పోలీసులమని చెప్పి ఇద్దరు వ్యక్తులను బెదిరించి, వారి వద్ద నుంచి నగదు, వస్తువులను కాజేసిన నలుగురు వ్యక్తులను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఆదివారం అర్ధరాత్రి రాజీవ్‌నగర్‌కు చెందిన రౌతు వెంకటరమణ, బోర రమేష్, వడ్లపూడి ప్రాంతానికి చెందిన వెంకటరమణ, బొర్ర శ్రీను మద్యం సేవించి వడ్లపూడి జంక్షన్ వద్ద బైక్‌పై వెళ్తున్న వి.అవినాష్‌ను, అతని స్నేహితుడు రవిని అడ్డగించారు. తాము పోలీసులమని చెప్పి వారిని బెదిరించారు. సెల్‌ఫోన్, రెండు వేల రూపాయల నగదు కలిగిన పర్సు, బైక్ లాక్కుని వారిని పోలీస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పి ఉడాయించారు. దీంతో బాధితులు సోమవారం దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవినాష్ ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఆ నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో తీరాన్ని ఆనుకుని ఉన్న లాసన్స్‌బే కాలనీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వేస్ట్ టు వండర్స్ పేరిట పార్కులో ఆధునికీకరించిన పలు క్రీడా ప్రాంగణాలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే క్రమంలో పార్కులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆలోచనల్లో భాగంగా వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచే విధంగా పార్కును తీర్చిదిద్దామన్నారు. ప్రారంభం అనంతరం ఆయా క్రీడా, ఆహ్లాదకరమైన సముదాయాలను పరిశీలించారు.